## కథ

మాపూరు విజయలక్ష్మి

**"భారతీయ వివాహ వ్యవస్థకు ఆకర్షింపబడి, భారతదేశం అందులోను ఆంధ్ర రాష్ట్రం వచ్చి మన తెలుగు సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేసుకున్న ఓ విదేశీజంట"**

# ఒద్దుకి వద్దు

ఈ వార్త, క్రింద వివాహ అలంకరణలో నిండుగా ఉన్న విదేశీజంట ఫొటో ఉంది. చదువుతున్న పేపరును పక్కనపెట్టి ఆలోచనలో పడింది అరుంధతి. నిజంగా భారతీయ వివాహ వ్యవస్థ అంత గొప్పదా? టి.వి.లో వార్తలు మొదలవుతాయన్న సూచనగా సిగ్నేచర్‌ట్యూన్ వినబడడంతో, ''అప్పుడే ఏడయిపోయిందా..కోర్ట్‌లో తీర్పు చెప్పేది ఈరోజే....త్వరగా పనులు పూర్తి చేసుకొని కోర్టుకు వెళ్ళాలి'' అనుకుంటూ చదువుతున్న పేపరు పక్కనపెట్టి సోఫాలోనుంచి లేచింది అరుంధతి.

సరిగ్గా అదే సమయంలో బెడ్‌రూంలో ఏడయినా ఇంకా బెడ్ దిగని వశిష్ట కూడా అలాగే అనుకున్నాడు. ''కోర్ట్‌లో ఈరోజే తీర్పు చెప్పేది త్వరగా లేచి తయారయి వెళ్ళాలి'' మనసులో వచ్చిన ఆలోచన ఆచరణలో పెట్టడానికి మనసు, శరీరం రెండూ సహకరించలేదు. చాలాసేపు అలా బెడ్ మీదే ఉండిపోయాడు. కోర్టుకు వెళితే తీర్పు ఏం వస్తుంది. కచ్చితంగా తను కోరుకున్నదే వస్తుంది. తనే కాదు ముఖ్యంగా అరుంధతి అదే కోరుకుంటున్నది. మనసులో ఏ మూలో అసంతృప్తిగా అసహనంగా, అంతకుమించి ఆందోళనగా ఉంది. అందుకే మంచం మీద నుంచి లేవబుద్ధికావడం లేదు. అరవై ఏళ్ళ వయసులో ఇప్పుడు జీవిత భాగస్వామి నుంచి వేరుకావలసి రావడం ఛ..ఛ.. ఎవరైనా వింటే వింతగా, విచిత్రంగా నవ్వుకోరూ...! ఛ..ఛ..దీనికీ వయసులో ఇలాంటి బుద్ధెందుకు పుట్టిందో!

'అమెకలాంటి బుద్ధి పుట్టడానికి కారణం నువ్వు కాదా...? నిజాయితీగా ఆలోచించు' అంతరాత్మ ప్రశ్నించినట్టయింది వశిష్టకు.

'ఏంటీ..! నేనా..? ఇది మరీ బాగుంది దాని బుర్రలో పురుగు తొలుస్తుంటే దానికి బాధ్యుడిని నేనా? తిని కూర్చొని కృష్ణ, రామ అనుకోకుండా, పిల్లలకు బుద్ధి చెప్పాల్సిన ఈ వయసులో అదంత పొగరెక్కి కొట్టుకుంటుంటే దానికి తనేం చెయ్యగలడు? నిన్నటికి నిన్న ఎంత పొగరుగా మాట్లాడింది. అసలు దానికి ఎప్పుడూ పొగరే తను మొదట్నుంచీ దాన్ని అణచిపెట్టి ఉంచబట్టిగాని లేకపోతే ఇది ఈ మాత్రమేనా లొంగి ఉండేదా! అమ్మో..దీన్ని పట్టగలిగే వాళ్ళుమా..? అసలు పెళ్ళయిన కొత్తలోనే ఎంత పొగరుబోతులా ఉండేది. తన తల్లి ఏమయినా అంటే వెంటనే మాటకు మాట చెప్పకపోయినా ఉండుండి ఒకేసారి ధాటిగానే జవాబు చెప్పేది. ఏం... ఒకవేళ తన తల్లి అత్తగారినన్న చాదస్తంతో కాస్త పొరపాటుగానే మాట్లాడి ఉండొచ్చు. నిజమే..అయితే...అంత మాత్రాన పెద్దా చిన్నా లేకుండా ఎదిరించేయడమే! అత్తగారన్న గౌరవంగాని, భయంగాని, భక్తిగాని కాస్తయినా ఉండక్కర్లేదూ!

ఎలాగైనా దానికి అహంకారం ఎక్కువ.

అసలప్పుడే చెప్పింది తన తల్లి, ''ఒరే! దీన్ని ఎప్పటికప్పుడు వంచకపోతే ఇది లొంగి ఉండదురా అని..'' అయినా ఎంత లొంగదీసి ఉంచితే మాత్రం ఏం ప్రయోజనం? ఈ వయసులో ఇలా దెబ్బకొడుతుందనుకోలేదు. తన పరువు తీసేస్తోంది పాపిష్టిది' కసిగా తిట్టుకున్నాడు. అంతకు మించి చేసేదేంలేక.

లోపల వంటగదిలో ఉన్న అరుంధతి మనసు కూడా పరిపరివిధాల పరిగెడుతోంది. 'ఈ వయసులో విడిపోవాల్సి రావడం కాస్త ఆందోళనగానే ఉన్నా ఈ చివరికాలంలోనైనా తనదైన స్వంత వ్యక్తిత్వంతో బ్రతకొచ్చన్న ఊహ కూడా మరోవైపు ఊరటనిస్తోంది. అసలు ఇంతకాలం ఈ బానిసబ్రతుకు ఎలా బ్రతికిందో తలచుకుంటే తనకే ఆశ్చర్యంగా ఉంది. పిల్లిని గదిలో పెట్టి కొడితే ఎదురు తిరిగినట్టుగా అయింది తన పరిస్థితి. పెళ్ళైంది మొదలు ఇంట్లో ఏ చిన్న విషయంలోను తన ప్రమేయం లేకుండానే అన్నీ జరిగిపోయాయి. తను కేవలం నిమిత్త మాత్రురాలిగానే ఉండిపోయింది. నోరు తెరిచి తన అభిప్రాయం చెప్పినా కచ్చితంగా తను చెప్పిందానికి పూర్తిగా వ్యతిరేకంగా జరిగేది. పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, ఆఖరికి వాళ్ళ పేర్లు పెట్టే విషయంలోను కూడా తన ప్రమేయం ఏం లేకుండానే అన్నీ జరిగిపోయాయి. ఒక దశలో అయితే తన కడుపున పుట్టిన పిల్లలే తనను కూరలో కరివేపాకులా తీసిపడేస్తారేమో అని భయపడింది. తన అదృష్టం కొద్దీ పిల్లలు త్వరగానే వాస్తవాన్ని గ్రహించగలిగారు. తనకు దగ్గరయ్యారు.

ఉదయం ఇంట్లో అందరికీ అన్నీ అమర్చిపెట్టి ఆదరాబాదరా నాలుగు మెతుకులు నోట్లో కుక్కుకొని ఆఫీసుకు పరుగెత్తేది. అక్కడ చాకిరీ అయిపోయాక చచ్చీ చెడీ ఇంటికి చేరేసరికి వంటగది రారమ్మంటూ పిలిచేది. ఇంటికొచ్చేసరికి భర్త ముందే వచ్చి, రిలాక్స్‌డ్‌గా కూర్చొని టి.వి చూస్తూ కనిపించేవాడు. పోనీ భార్య ఈసురోమంటూ వస్తుంది కాస్త టీ చుక్కయినా పెట్టి ఉంచుదామన్న జ్ఞానం లేదా మానవుడికి. పైగా తను ఇంటికొచ్చేసరికి, ''ఇప్పటి వరకు ఆఫీసేనా? ఎప్పట్నుంచి చూస్తున్నానో కనీసం టీ అయినా తాగలేదు. త్వరగా టీ పెట్టు'' అంటూ ఆర్డర్ వేసేవాడు. ఉసూరుమంటూ కొంగు నడుంచుట్టూ బిగించి వంటగదిలో దూరేది. వండిన వంటలన్నిటికీ వంకలు పెట్టి, ''మా కొలీగ్ వాళ్ళావిడ ఎంత బాగా వంట చేస్తుందో..మా ఫ్రెండ్ వాళ్ళావిడ వాడికి రోజూ ఎన్ని రకాల అయిటమ్స్ చేసి పెడుతుందో ఎంతయినా వాళ్ళు అదృష్టవంతులు'' అంటూ సాగదీస్తుంటే తన మనసు ఉక్రోషంతో రగిలిపోయేది. ఎప్పుడైనా సహనం నశించి వాళ్ళతో నీళ్ళతో పోలికలెందుకు వాళ్ళూ, నేను ఒకటెందుకవుతాం..ఇంటి దగ్గర ఉన్నవాళ్ళు ఎన్ని రకాలయినా చేస్తారు. ఇంటా బయటా చాకిరీ చేసేదాన్ని నాకెలా కుదురుతుందంటూ ఎదురుతిరిగితే-

''నీకు ఉద్యోగస్తురాలినన్న తలబిరుసుతనమెక్కువ, ఏం..ఆఫీసు మొగుడికి చాకిరీ చేస్తావుగానీ ఇంట్లో అసలు మొగుడికి మాత్రం చాకిరీ చెయ్యలేవా?'' అంటూ పచ్చిగా మాట్లాడేవాడు.

''పోన్లెండి ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండి మీకు సేవలు చేసుకుంటాను'' అనేది కచ్చిగా.

''ఏంటీ ఉద్యోగం మానేస్తావా! మానెయ్..మానెయ్..కాకపోతే, మానేసేముందు మీ బాబుని నా పేరుమీద ఓ పది లక్షల రూపాయలు బేంక్‌లో డిపాజిట్ చెయ్యమని అప్పుడు మానెయ్'' అనేవాడు నిర్లజ్జగా.

'వశిష్ట. ఎంత అందమయిన పేరు. పేరుకు

తగ్గట్టు అందమైన రూపం. కానీ మనస్తత్వమే పర మవికృతం. ఆ పేరులాగే మనిషి రూపం లాగే మనస్తత్వం కూడా అందంగా ఉండుంటే ఎంత బాగుండేది' ఈ మాట రోజుకెన్నిసార్లనుకుం టుందో అరుంధతి.

''అమ్మా..అమ్మా..'' అరుపులాంటి పిలు పుతో పాటు లోపలికొచ్చింది రమ.

''రా..రమా! రా'' కూతుర్ని సాదరంగా పిలి చింది అరుంధతి.

''వస్తానుగాని..నువ్విలా రా..కూర్చో'' తల్లిని చెయ్యి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకొని తనూ సోఫాలో కూర్చుంది రమ.

''నేను నీకు చెప్పేదాన్ని కాదుగాని..నీ నిర్ణయం మార్చుకోలేవా అమ్మా?'' బాధగా అడిగింది రమ.

''సారీ రమా..నీకు తెలిసిందగ్గర్నుంచీ ఇంట్లో జరుగుతున్న భాగోతం చూస్తూనే ఉన్నావుకదా! కనీసం ఈ వయసులో అయినా మీ నాన్నలో మార్పు రాలేదు సరికదా, అతని మనస్తత్వం మరీ ఘోరంగా తయారయింది''

''ఆ విషయం నాకూ తెలుసమ్మా..కానీ ఒక్క సారి ఆలోచించు..ఈ వయసులో విడాకులంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటుంది. బ్రతుకులో నాన్నతో నువ్వు ఎంత మానసిక క్షోభను అనుభ వించావో నాకు బాగా తెలుసు. కానీ ఇంతకాలం ఓర్పు వహించినదానివి ఈ చివరి కాలంలో ఎందు కమ్మా ఈ తొందరపాటు?''

''ఇంతకాలం ఓర్చుకున్నాను కాబట్టే ఇకనైనా నా వ్యక్తిత్వానికి తగినట్టుగా బ్రతుదామనుకుంటు న్నాను. ఒకరికి ఒకరుగా బ్రతకవలసిన ఈ వయ సులో కూడా రోజూ తగవులాడుకుంటూ బ్రతికే కంటే విడిపోవడమే మంచిది'' తాపీగా చెప్పింది అరుంధతి.

ఇంకేం మాట్లాడలేకపోయింది రమ.

'నిజమే తన తల్లిని తప్పుపట్టడానికి వీల్లేదు. ఆవిడ కూడా మనిషేగానీ యంత్రం కాదు కదా! ఆమెకి మాత్రం ఓర్పనేది ఎంతకాలం ఉంటుంది. అయినా నాన్నగారు ఈ చివరి దశలోనైనా మారక పోతే ఎలా' అనుకుంటూ లేచి తండ్రి గదిలోకి నడి చింది రమ.

''నాన్నా''

''రామ్మా...రమా..'' కూతుర్ని చూసి లేచి కూర్చుంటూ పిలిచాడు.


''నాన్నా ఏంటిదంతా'' విసుగ్గా అంది రమ తండ్రి పక్కన కూర్చుంటూ.

''నన్నేం చెయ్యమంటావు? ఈ ప్రశ్న మీ అమ్మనే అడగకపోయావా?'' అన్నాడు వశిష్ట.

''అడిగాను..''

''ఊ..అడిగితే ఏం చెప్పింది?''

''ఏం చెప్తుంది! ఉన్నవే చెప్పింది. అయినా



నాన్నా! ఇకనయినా నువ్వు మారవా?'' విసుగ్గా అంది రమ.

''నువ్వూ అలానే మాట్లాడుతున్నావా రమా! ఓర్పు మీ అమ్మకేనా? నేను మాత్రం నా అసహ నాన్ని ఎంత అణచుకున్నాను. పెద్ద తనే ఉద్యోగం చేస్తున్నానన్నట్టు, ఏ రోజయినా కాస్త తీరిగ్గా కూర్చొని నాతో మాట్లాడిందా? ఆఫీసునుంచి రావడం, పెద్ద తనొక్కర్తే ఇంటా బయటా కష్టపడి పోతున్నట్టు గబగబా వంటగదిలోకి దూరిపో వడం, టైమయ్యేసరికి భోజనాలు పెట్టేసి, తను తిని పడుకోవడం, మళ్ళీ ఉదయం లేచింది మొదలు మామూలే. కష్టం, సుఖం మాట్లాడడం, ఇంటి విషయాలు చర్చించడం ఏవన్నా చేసేదా? అయినా నేను మాత్రం చిరాకుపడకుండా సర్దుకు పోలేదూ... మీకేం తెలుసు? నువ్వు, మీ తమ్ముడు మీ చదువుల బిజీలో మీరుండేవారు. నేనెంత ఒంటరితనాన్ని అనుభవించానో నాకే తెలుసు'' అన్నాడు వశిష్ట.

''మరి ఈ విషయం మీరు అమ్మతో ఎప్పుడైనా చెప్పారా?''

''ఎక్కడ నేను చెప్పే అవకాశం ఎప్పుడైనా ఇచ్చిందా? ఎప్పుడూ ముభావంగా మొహం మాడ్చుకునే ఉంటుంటే ఎలా చెప్పను? అయినా మీ అమ్మ అందరి ముందు నన్నొక విలన్‌లా చిత్రీ కరించడంతోనే తృప్తిపడేదిలే!'' అన్నాడు వశిష్ట.

''తప్పంతా అమ్మదే అన్నట్టు మాట్లాడకండి నాన్నా...మాట్లాడే అవకాశం అమ్మ మీకివ్వడమే మిటి? అసలు మీరెప్పుడైనా అమ్మను అర్థం చేసు కోవడానికి ప్రయత్నించారా? ఏ విషయంలోనైనా అమ్మమాట పడనిచ్చేవారా? మరలాంటప్పుడు అమ్మ ముభావంగా కాక ఇంకెలా ఉంటుంది?''

''సరేలేమ్మా నువ్వెప్పుడూ మీ అమ్మనే సమర్థిస్తా వుగాని నేను చెప్పేది అర్థం చేసుకోవు కదా! సరే నేను స్నానం చేసి వస్తాను. కోర్టుకు వెళ్ళే టైమ యింది'' అంటూ లేచాడు వశిష్ట.

తల్లిదండ్రులను ఎలా ఆపాలో తెలియక బాధగా కూర్చుండిపోయింది రమ.

''రమా టిఫిన్ తిందువుగాని రా!'' తల్లి పిలుపు వినిపించి వంట గదిలోకి నడిచింది.

''ఈ ఇంట్లో నీకు నేను పెట్టే ఆఖరు టిఫిన్ ఇదే నేమో'' ప్లేట్‌లో టిఫిన్ పెట్టి కూతురికి అందిస్తూ

అంది అరుంధతి. ఆ మాటలన్నప్పుడు ఆమె కంఠంలో వణుకు స్పష్టంగా వినిపించింది రమకు. 'బైటికి గంభీరంగా కనబడుతోందిగాని అమ్మ చాలా బాధపడుతున్నట్టుగా అలజడిగా ఉంది' అనుకుంది రమ.

రమకు కూడా చాలా కష్టంగానే ఉంది. ప్లేట్లో ఉన్న ఇడ్లీ తుంచి నోట్లో పెట్టుకుంది గాని అది గొంతు దిగడం లేదు.

'అవునూ! వార్ధక్యంలో కంటే వయసులో ఉన్నప్పుడే పౌరుషం ఎక్కువగా ఉంటుందంటారు. మరి అమ్మ అప్పుడంతా సహనంతో సర్దుకుపోయి ఇప్పుడెందుకిలా అసహనం పాలయ్యింది' మనసులోకి వచ్చిన సందేహం దాచుకోలేక తల్లి ముందు బయటపెట్టేసింది.

కూతురి సందేహం విని చిన్నగా నవ్వింది అరుంధతి.

''నిజమే! నువ్వన్నట్టు ఇలా విడిపోవడం, విడాకులు తీసుకోవడం వయసులో ఉన్న భార్యాభర్తల మధ్యే ఎక్కువగా జరుగుతుంది. నాక్కూడా అప్పుడప్పుడు ఇలా నిత్యం గొడవలు పడుతూ కలిసి బ్రతికేకంటే విడిపోతే నయం కదా అనిపించేది. కానీ మీ కారణంగానే ఆ పని చెయ్యలేకపోయాను.''

''మా కారణంగానా?'' ఆశ్చర్యంగా అడిగింది రమ.

''అవునమ్మా..అప్పుడు నేను తొందరపడితే విడిపోయిన తల్లిదండ్రుల పిల్లలుగా మీరెన్నో అవమానాలు భరించవలసి వచ్చేది. మీ భవిష్యత్తు సక్రమంగా ఉండేదికాదు. అందుకే అప్పుడు అంత బాధను గొంతులోనే దిగమింగుకున్నాను. అందుకే మీకంటూ స్థిరమైన జీవితాలు ఏర్పడ్డాయి. ఇంక నాకు మీ గురించి దిగుల్లేదు. అందుకే ఇకనైనా ఈ నిత్య సంఘర్షణలకు స్వస్తి చెప్పాలని నిర్ణయించుకున్నాను'' నెమ్మదిగా చెప్పింది అరుంధతి.

''అమ్మా రమా! నేను కోర్టుకు బయలుదేరుతున్నాను'' హాల్లోంచి కేకేసి చెప్పాడు వశిష్ట.

''వస్తున్నాను ఉండండి నాన్నా'' చెయ్యి కడుక్కొని గబగబా హాల్లోకి పరుగెత్తింది రమ.

''నాన్నా నేనూ వస్తాను'' అంది.

''సరే పద!'' ముందుకడుగేస్తూ చెప్పాడు వశిష్ట.

''అమ్మ కూడా వస్తుంది నాన్నా'' కూతురి మాట విని నవ్వొచ్చింది వశిష్టకు.

''మీ అమ్మ రాకుండా ఎలా ఉంటుందమ్మా. ఆవిడతోనేగా పనంతా'' అదోలా నవ్వుతూ అన్నాడు.

''అది కాదు నాన్నా ముగ్గురం కలిసే వెళదాం''

''ఎందుకులేమ్మా! ఆవిడ తరువాత వస్తుందిలే. మనం వెళదాం పద''

''ప్లీజ్ నాన్నా కాదనకండి. మీ ఇద్దరితో కలిసి వెళ్ళడం మళ్ళీ కుదరకపోవచ్చు. కనీసం ఇప్పుడైనా కలిసి వెళదాం నాన్నా..'' నెమ్మదిగా అంది.

ఏమనుకున్నాడోగానీ ''సరేలే..అలాగే చేద్దాం'' అన్నాడు.

''థాంక్యూ నాన్నా'' చెప్పి లోపలకు వెళ్ళింది రమ. లోపల పని ముగించుకొని ఇల్లంతా కలియతిరిగి చూసుకుంటోంది అరుంధతి. ఒక్కో గదినే చూస్తూ తన కెదురయిన అనుభవాన్ని జ్ఞాపం చేసుకుంటోంది. బహుశా ఆ జ్ఞాపకాల్లో అంతా చేదే తప్ప తీపి జ్ఞాపకాలేవీ లేవేమో!

''అమ్మా''

కూతురి పిలుపువిని ఇటు తిరిగింది. అప్పటికే కోర్టుకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉందామె. ''రమా! నువ్వు కూడా వస్తావా''

''వస్తానమ్మా. నేనే కాదు. నాన్న కూడా మనకోసమే ఆగిపోయారు. ముగ్గురం కలిసే వెళదాం''

ఆశ్చర్యంగా చూస్తూ అంది అరుంధతి ''వద్దులే రమా! ఆయన్ని వెళ్ళనీ, మనం విడిగా వెళదాం.''

''ప్లీజ్ అమ్మా'' అంటూ తండ్రికి చెప్పినట్టే చెప్పి ఒప్పించి బయటకు తీసుకొచ్చింది.

అప్పటికే ఆటోని తీసుకొచ్చి సిద్ధంగా ఉన్నాడు వశిష్ట. ముందు అరుంధతి తరువాత రమ తరువాత వశిష్ట కూర్చున్నారు.

ఏభై ఏళ్ళ వయసులో విడాకులు తీసుకోవడానికి పెళ్ళైన కూతురితో కలిసి ఒకే ఆటోలో వెళుతున్నారు. ముగ్గురి మనసుల్లో విచిత్రమైన భావనలు మెదిలాయి.

వీళ్ళు ఊహించినట్టుగానే కోర్టులో అరుంధతి, వశిష్టలకు విడాకులు మంజూరయ్యాయి. ఎవరికి వాళ్ళు మౌనంగా కోర్టు బయటికి చేరుకున్నారు. బయటకు రాగానే, ''వస్తానమ్మా రమా!'' కూతురితో చెప్పి ముందుకు నడిచాడు వశిష్ట.

తండ్రి వెనకే నాలుగడుగులు వేసిన రమ ''నాన్నా'' పిలిచింది.

''ఏంటమ్మా'' అన్నాడు వశిష్ట నడుస్తున్నవాడల్లా ఆగిపోయి.

''ఎక్కడికి వెళ్తున్నావు?'' అడిగింది రమ.

''ఇంటికి''

''మరి అమ్మ ఎక్కడుంటుంది?''

ఏం మాట్లాడలేదు వశిష్ట. ''మాట్లాడవేం నాన్నా'' రెట్టించింది రమ.

''అది నేనెలా చెప్పగలను'' ముభావంగా అన్నాడు వశిష్ట. ఆశ్చర్యంగా చూసింది రమ. ఇన్నాళ్ళుగా కలిసి బతికిన బంధాన్ని ఎంత తేలిగ్గా వదిలించుకున్నాడు తన తండ్రి..!

ఇంతలో అరుంధతి వెళ్ళిపోతుండడం చూసి అటు పరుగెత్తింది ''అమ్మా..అమ్మా..''

కూతురి పిలుపునకు ఆగి అటు చూసింది అరుంధతి.

''అమ్మా ఎక్కడికి వెళతావు?'' బాధగా అడిగింది రమ.

''ఎక్కడికైనా వెళ్ళొచ్చు రమా! ఈ చివరిరోజు గడపడానికి ఎక్కడైనా ఆమాత్రం ఆశ్రయం దొరక్కపోతుందా..''

''అవేం మాటలమ్మా..నాతోరా!''

''నీతోనా! ఎక్కడికి?''

''ఎక్కడికేంటమ్మా! మా ఇంటికి''

''వద్దులే రమా..ఎవరింట్లో వాళ్ళుంటేనే మంచిది. నాకేలాగూ ఓ ఇల్లనేది లేదు. నా కారణంగా నువ్వు ఇబ్బంది పడడం నాకిష్టం లేదు'' చిన్నగా అంది అరుంధతి.

''ఎలా బ్రతుకుతావమ్మా..ఎక్కడుంటావు?''

కూతురి ప్రశ్నకు చిన్నగా నవ్వింది అరుంధతి. ''ఎలా బ్రతకడమేముంది రమా! ఆర్థికంగా భయపడాల్సిన పనిలేదు. నాకొచ్చే పెన్షన్ నేనొక్కదాన్ని బ్రతకడానికి సరిపోదంటావా? ఇక, ఎక్కడుంటావు అనడిగావు. నేనొక్కదాన్ని ఉండడానికి ఈ ప్రపంచంలో చోటే లేదంటావా! అందులోనూ పెరిగిన మన నాగరికతకు, అవసరాలకు అనుగుణంగా వెలుస్తున్న ఓల్డ్ఏజ్ హోమ్స్ ఉండనే ఉన్నాయి కదా!''

''ఓల్డేజి హోమ్‌లో ఉండాల్సిన ఖర్మ నీకేంటమ్మా..మా ఇంటికి రామ్మా..'' బాధగా అంది రమ.

''తప్పమ్మా ఓల్డేజి హోమ్‌లో ఉండవలసి రావడం ఖర్మకాదు. నువ్వేం బాధపడకు. చివరిదశలో ఏ బాదరబందీలు, ఆందోళనలు, బాధ్యతలు, బరువులు లేకుండా హాయిగా ప్రశాంతంగా బ్రతికేచోటు ఈ ఓల్డేజిహోమ్‌లు. అందుకే వాటిని వృద్ధుల శరణాలయాలు అన్నారు. ఇంత కాలం అడుగడుక్కీ అనుక్షణం రాజీపడుతూ బ్రతికిన ఆ బ్రతుక్కి స్వస్తిచెప్పి ఈ కొద్దికాలమైనా నాకు నచ్చినట్టు బ్రతకాలనుకుంటున్నాను'' చెప్పింది అరుంధతి.

''ఎవరికైనా జీవితంలో రాజీపడకుండా బ్రతకడం సాధ్యమవుతుందా అమ్మా'' అడిగింది రమ.

''జీవితంలో రాజీ ఉండాలి రమా! కాదనను. కానీ జీవితమే రాజీ కాకూడదు కదా!''

''నువ్వెన్ని చెప్పినా నిన్నిలా వదిలి వెళ్ళాలనిపించడం లేదమ్మా''

''ఫరవాలేదు రమా! నా గురించి నువ్వేం దిగులు పడకు. నీకెప్పుడు అమ్మను చూడాలనిపిస్తే అప్పుడు రావచ్చు. మరిక నేను వెళ్ళిరానా!'' కూతుర్ని ఓదార్చి తన గమ్యం వైపు సాగిపోయింది అరుంధతి.

హాయిగా పిల్లలతో, మనవలతో కాలక్షేపం చేస్తూ ఒకరికొకరుగా బ్రతకవలసిన ఈ వయసులో భిన్న ధృవాల్లా చెరోవైపు సాగిపోతున్న తల్లిదండ్రుల్ని చూస్తూ నిశ్చేష్టురాల్లా నిలబడిపోయింది రమ.

❀